# పద్మవ్యూహం

పెద్దకథ

ఆర్ యమ్ చిదంబరం

సంధ్యాసమయం—

శారద సిలోన్ స్టేషనుకోసం తంటాలు పడుతూంది పావుగంటసేపు ఆ స్టేషనునుంచి వచ్చే మూడు తెలుగుపాటలకోసం అవస్థపడుతోంది నాకు నవ్వొచ్చింది ఇంతచిన్న విషయానికే ఇంత బాధపడవలసి వచ్చినపుడు అసమర్థుడి జీవితయాత్రలో అగాధాల్ని దాటడమెలాగ? నిలువుటద్దం నన్ను వెక్కిరించింది తలమీద అక్కడక్కడున్న ధవళకేశాలు నన్నుచూసి నవ్వుతున్నాయి పదేళ్ళక్రితం ఆ అద్దమే నా ప్రతిబింబాన్ని మరోలా చూపించింది ఆత్మ ఒకటైనా శరీరంలో మార్పులు రావటం నామట్టుకు చిత్రంగానే వుంది శారద ముఖంవంక చూశాను ఇదివరకటి మల్లే ఆ మూగ కనుల్లో అవ్యక్తపు పిలుపులు లేవు చిరునవ్వులో జాబిల్లి నవ్వటం నిండుగాలేదు శారద జీవితాన్నర్థంచేసుకుని బారెడు జడతో ఒక్కమాటు కదలుతుంది ఇంతలో టేబిలుమీదున్న వుత్తరం కనిపించింది అంతవరకూ నేనది చూడలేదు

"శారదా! ఈ వుత్తరం ఇవేళే వచ్చిందికదూ! నాతో చెప్పలేదేం?" అన్నాను మందలింపుగా శారద క్షమించ మన్నట్టు చూపులు ప్రసరిస్తూ మొహంలో విసుగుదల కనబరుస్తూ చూసింది

కవరు చించగానే ఏదో శుభలేఖ, పావుటావు కాగితంమీది వుత్తరమూ వూడిపడ్డాయి ముందు దృష్టి శుభలేఖ మీదకు జారింది సావిత్రికి పెళ్ళి—అయిదే రోజులుంది తరవాత వుత్తరం చదవసాగాను

"బాబాయ్‌కి—

ఈ ఆరునెలలుగా వుత్తరం రాయలేదని కోపంగావుందికదూ? ఎన్నో మనసిక సంఘర్షణల్ని ఎదుర్కోవలసి వస్తూంది" అంటూ వుత్తరం మొదలుపెట్టి ఏదో వేదాంతం—జీవితపు విలువలమీద విమర్శలు సాగించింది సావిత్రి కీపాటికి పద్దెనిమిది దాటుతాయంతే! అప్పుడే అంత వేదాంతం—జీవితంమీద నైరాశ్య దృక్పథం ఏర్పడటానికి కారణం ఏమై యుంటుంది? అగాధాలను తవ్వి తీస్తేనేగాని పునాదులు బయటపడవు

"బాబాయ్! నాకు ఆత్మశాంతి అసలు లేదు నువ్వు వెంటనే రావలి నీతో నేను చాలాచెప్పుకోవాలి అంతేకాని ముహూర్తానికి ముందు వచ్చి నేనేం చేయను అంటే కాదు నువ్వుతప్ప నాకు మరెవరూలేరు" అంటూ వుత్తరం ముగించింది

ఉత్తరం చదవటం పూర్తిచేసి నిట్టూరుస్తున్న నన్నుచూసి ఇంతసేపూ ఓపికపట్టిన శారద అసహనంతో 'ఏమిటండీ ఆ వుత్తరం? ఎవరు రాశారు?' అనడిగింది ఆమెకు వుత్తరం అందించి 'సావిత్రి వుత్తరం రాసింది, వెంటనే రమ్మని చదువు నీకే బోధపడుతుంది ఆమె తత్వం నా కసలు అర్థం కావటంలేదు' అన్నాను శారద శుభలేఖ చూడబోయేసరికి లైట్లు ఆరిపోయాయి జీవితంలో ప్రతీదీ ఇంతేగా మోలు! సమయానికి దీపాలు ఆరిపోయి చీకటి కమ్ముకోవటం-వేళకు రైలు అందకపోవటం-అయిదు నిమిషాలు పోయాక

శారద రెండూ చదువుతుంది

"ఏమైనా సావిత్రి అదృష్టం బాగాలేదండీ" అంటూ పెదవి విరిచింది

"అయితే మనం రేపుదయమే వెళ్లాలి"అన్నాను కేలండర్ కేసి చూస్తూ

ఆకాశం తళుక్కున మెరిసింది వర్షానికి సూచనగా మోలు!

"ఊఁ హోల్డాలు అవీ సర్దుతా"అంటూ శారద లోపలకెళ్ళింది సావిత్రికి సంబంధించిన గతమంతా ఒక్కసారి తళుక్కుమంది సావిత్రి ఇక్కణ్ణుంచి వెళ్ళి సరిగ్గా రెండుసంవత్సరాలవుతుంది

"పెట్టెకూడా సర్దమంటారా?"అంటూ శారద అంతరాయం కలిగించింది

"పెట్టెందుకు? సూట్ కేస్ చాలు"అన్నాను

ఆకాశం కొద్దిగా వురిమింది

* * *

సంధ్యాసమయం.

బార్కర్ రాసిన 'డ్యూటీ టు సైబర్' చదువుతున్నా అతని భాషావికాసంగురించి అతని వాదనలో వుండే విచిత్ర ధోరణిగురించి ఆలోచిస్తున్నా

"నమస్కారమండి!"అంటూ ఓ వ్యక్తి ప్రవేశించాడు అతనెవరో నాకు తెలియదు. అతన్నెక్కడా చూసినట్టు కూడా గుర్తులేదు

"నన్ను మీరెరగనప్పుడు నాగురించి ఆలోచిస్తే మాత్రం ఏమిటి లాభం?"అని ఎదురుగావున్న కుర్చీమీద కూర్చున్నాడు

అతను లావుగా పొట్టిగా వున్నాడు గడ్డం బాగా పెరిగింది మాటల ధోరణికూడా చిత్రంగా వుంది

"ఇక నన్ను నేను పరిచయం చేసుకుంటాను ఇవేళ వుదయమే మీ పక్కింట్లో మేం దిగాం మీరు పొరుగునవున్నవారు కనక మీతో స్నేహం కలుపుకుందామని వచ్చాను నాకీ పట్నం కొత్త—ఏం తెలియదు ఒట్టి పల్లెటూరి మొద్దననుకోండి అసలు నేనిక్కడకు రాటానికి కారణం మా మేనగోడలు చదువుకోసం అదేమో మా వూళ్ళో ఫస్టుఫారం ప్యాసైంది చాలా తెలివైంది చదివించమని నలుగురూ అన్నారు వాళ్ళ నాన్నేమో పోయాడు అమ్మ చిన్నప్పుడే పోయిందనుకోండి అంచేత దానికి దిక్కు నేనే! వాళ్ళ నాన్న మిగిల్చిపోయింది ఓ పదెకరం నేల-అంతే! దాంతో దానికి పెళ్ళీఅదీ చెయ్యాలి, చదువూ చెప్పించాలి ఎలా? మావూళ్ళో హయ్యర్ ఎలిమెంటరీ స్కూలు వుంది కాని హైస్కూలు లేదు అంచేత పట్నం రావలసి వచ్చింది"

అతను ఆగి స్వెట్టరల్లుతూన్న శారదకేసి చూశాడు

"ఇదంతా ఏమిటని మీరు ఆశ్చర్యపోతూన్నారు కదూ! నాకో చిన్న పొగాకువ్యాపారం వుంది లెండి దాంతోనే నా జీవితయాత్ర సాగాలి అంచాత నేనిక్కడ వుండటం వీలుపడదు దానితో అమ్మమ్ముంది అదిక్కడే వుంటుంది అదే వండి పెడుతుందనుకోండి ఇంతకీ మిమ్మల్ని నేను కోరేదేవిటంటే సావిత్రిని—అదేలెండి దాని పేరు—ఓ కంట కనిపెడుతూండాలి మీ మంచితనం గురించి విని నేను మిమ్మల్ని యీ చిన్న కోరిక కోరుతున్నాను ఈ పట్నంలో మీరే తోడు దానికి"

నాకు నవ్వొచ్చింది శారదకూడా నవ్వుతోందని గ్రహించాను

"దానికేంవుందిలెండి ఇరుగు పొరుగు వాళ్ళకు అందరూ తోడుపడుతూంటారు. దీనికి మీరింతగా అడగాల్సిన అవుసరం ఏమీలేదు"

"అలాకనకండి సావిత్రి చిన్నపిల్ల దానికేం తెలియదు వట్టి అమాయకురాలు"

అయిదు నిముషాలు మౌనంగా వున్నాం ఇంతసేపూ అతను చెప్పిన మాటల్ని నెమరువేసుకుంటూ కూర్చున్నా

"మరి నాకు సెలవిప్పించండి...వస్తానమ్మాయ్! సావిత్రిని నీలో కలుపుకోవాలిమరి దానికెవరూ లేరు పాపం-కట్నాలు కానుకలూ యిచ్చి పెళ్ళి చెయ్యలేను కనక దాని మొగుణ్ణి అదే వెదికి తెచ్చుకోవాలి ఏమైనా దానిది దురదృష్టజాతకం"

గడియారం అరగంట కొట్టింది అతను నమస్కరించి వెళ్ళిపోయాడు

"అంతా తమాషాగావుందికదూ?" అన్నట్టు శారద కళ్ళతో కలుక్కుమంది

ఆ మర్నాడు ఉదయం—

హ్యూమ్స్ఫిలాసఫీని అర్థం చేసుకోటానికి యత్నిస్తున్నా "బాబాయ్! ఇవి మావయ్య మీకిమ్మన్నాడు సిన్న యివ్వటం మర్చిపోయాడట"

అంటూ సావిత్రి అరడజను బత్తాయి పండ్లను బల్ల మీద వుంచింది

"ఇవన్నీ ఎందుకు సావిత్రీ!" అన్నాను ఆమె చూపిన చనువును పొడిగిస్తూ నిజానికి సావిత్రి తెల్లగా పాలరాతి విగ్రహంలా వుంది. పూలపరికిణీ కట్టుకుని దానిమీద ఆకుపచ్చని సాటిన్ జాకెట్టు తొడుక్కుంది ఇంకా బాల్యం వెనకడుగు వెయ్యలేదు నుదుటిమీద వుండే అర్థచంద్రాకారపు బొట్టు నిండుగావుంది అదేగా ఆడదానికి కావలసింది కళ్ళల్లో బాధా, ఆవేశం, చమత్కృతి మేళవించి కనిపించాయి చేతులకి రెండంటే రెండే చవకరకం గాజులున్నాయి

"ఉండనీ బాబాయ్!' అంటూ సావిత్రి వంటింట్లోకెళ్ళింది నేనుఆశ్చర్యపోయి చూస్తున్నా హ్యూమ్స్ఫిలాసఫీ కంటే ఈ అమ్మాయి మనస్తత్వాన్ని అర్థం చేసుకోటం కష్టమనిపించింది మామయ్యో చిత్రమైన మనిషనుకుంటే అతన్ని మించిపోయింది

"నేరుబ్బుతాఉండు పిన్నీ!"సావిత్రి కంఠం—

"వద్దమ్మా! నీ కొడుకి బాధ!" శారదకంఠం—

"నువ్వూరుకో పిన్నీ నాకు వంటపనంటే ఎంతో సరదా! తప్పుకో చెప్తాను"

"తెలివైనదానివే! ఏవిటో అనుకున్నా మీ యింట్లో వంటైందా? మాయింటికొచ్చావు?"

"మా అమ్మమ్మ వుందిగా"

అది మొదటిసారిగా సావిత్రి మాయింటికి రావటం చనువుగా నడుచుకోటం

కొంతమంది వ్యక్తులమీద అకారణంగా- అసాధారణంగా అనుమానాలు జనిస్తాయి అలాగే ఆదరణకూడా కొందర్ని అకారణంగా ద్వేషిస్తాం- ఒకవ్యక్తి తుంటరనే అభిప్రాయం కలిగిందనుకోండి అతను ఎంత సహృదయుడైనా మొదటిసారి అతనిమీద నిరాధారంగా కలిగిన అభిప్రాయం మాసిపోవటం అసాధ్యం దానికి సరైన కారణం మన స్తత్వశాస్త్రంకూడా ఇవ్వదు అలాగే సావిత్రిమాటల్లో,చేతల్లో,హావభావాల్లోఒకరకమైన వికాసం, ఆకర్షణ అనుభూతి కనిపించాయి సావిత్రి నవ్వినప్పుడు మెరుపులు తళుక్కుమన్నట్టుంటుంది

ఆ సాయంత్రం సావిత్రి లెక్కల పుస్తకం పుచ్చుకు వచ్చింది "బాబాయ్! . ఈ లెక్క చెప్పాలి"అంది చూపుడు వేలితో లెక్క చూపిస్తూ- లాభనష్టాలమీది లెక్క కొంత భయపడుతూ చెప్పి మరింత భయపడుతూ ఆన్సరు చూశాను రైటే! లెక్కలు రావని చెప్పటం నామోషీ అనిపించింది

"అరె! నాలుగు స్టెప్పుల్లో వచ్చేసిందే! మా లెక్కల మేష్టారు ఎక్స్ అనుకోమనీ మరోటి అనుకోమనీ కంగారు పెట్టేశారు" అంది సావిత్రి ఆశ్చర్యపోతూ కళ్ళల్లో ప్రకటించిన భావంలోకి తొంగి చూశాను కళ్ళు రెండూ బాగా వికసించిన పద్మాల్లాగున్నాయి కాటుక కొంచెం చెదరింది

"అయితే బాబాయ్‌కి లెక్కలు బాగావచ్చన్న మాట! ఈ మాటు ప్రతిలెక్క నిన్నే అడుతాను" అని సావిత్రి అనేసరికి నాకు నిజంగా భయంవేసింది

సావిత్రిలో మరో గుణంకూడా కనిపించింది నాకు ఎలాంటి విషయాన్నైనా గంభీరంగా అణచిపెట్టి వుంచేది ఓ నాడామె పస్తుపడుతుందన్నసంగతి శారద మూడు రోజులు పోయాక ఆరా తీసింది నేనూ శారదా సావిత్రిని మందలించాం

"ఈ యిల్లు మీ యిల్లే ననుకో నీకేం కావలసినా తీసికెళ్ళు ఫరవాలేదు కాని ఇంక పస్తుపడుతున్నావంటే వూరుకునేది లేదు"

ఆ నాటినుండి క్రమంగా సావిత్రి మాలోకలిసిపోయింది

ఆమెవచ్చి నెలరోజులు దాటినా ఆ ముసిల్ది మా యింటికి రాకపోవటం కొంత ఆశ్చర్య కరంగానే వుంది ఓనాడు శారద వాళ్ళింటికెళ్ళింది సాయంత్రం నేను ఆఫీసునుండి రాగానే ఆత్రంగా చెప్పుకుపోయింది

"ఏవిటో అనుకున్నాను కాని సావిత్రి చాలా గడుసుది సుమండీ పాపం ఇవేళ వాళ్ళస్థితి కళ్ళారా చూసేసరికి ఏడుపొచ్చింది వాళ్ళింట్లో పట్టుమని పది గిన్నెలు కూడాలేవు వంట అదీ ఎలా చేస్తోందో మరి ఎలా సర్దుకుంటున్నారో! తన స్థితికి సిగ్గుపడే మనింటికి రాలేక పోయిందని ఆ ముసలమ్మ క్షమాపణ చెప్పుకుంది ఆవిడకు సరిగ్గా కళ్ళు కనిపించవు సావిత్రి తన బట్టలన్నీ చూపించింది మొత్తం మూడు జతలు అంతే వాట్లతో ఎలా కాలక్షేపం చేస్తోందో! చూశారా,

తన పేదరికాన్ని ఎలా దాచేసి గొప్ప ఇంటిబిడ్డలా మసులుకుంటోందో! అసలెందుకు వెళ్ళానా అని అని తరవాత బాధపడ్డాను"

నా కళ్ళల్లో నీళ్ళు నిండటం గమనించిన శారద ఆగిపోయింది తరవాత రెండు రోజులదాకా సావిత్రి మా యింటికి రాలేదు కంగారుపడిపోయాను తరవాత తెలిసింది వాళ్ళ అమ్మమ్మకు జ్వరం వచ్చిందని

మూడోనాడు సావిత్రి రానేవచ్చింది

"బాబాయ్! రేపు నా పుట్టినరోజు మిమ్మల్నిద్దర్నీ భోజనానికి పిలవమంది మా అమ్మమ్మ తప్పకుండా రావాలి"

"అంతేకాని నువ్వు పిలవటం లేదన్నమాట! రేపు మా ఆఫీసుంది"

"సెలవు పెట్టేయ్! నా పుట్టిన రోజుకు రాకపోతే నేనూరుకోను తెలిసిందా?"

"అలాగేలే" అని ఆమె వెళ్ళిపోయాక శారద నడిగాను

"సావిత్రిమావయ్యవచ్చి నెలరోజులు దాటింది కదా! వాళ్లదగ్గర డబ్బుందా? అడగలేకపోయావా?"

"అడిగాను కాని అమ్మో! అది సెరజాణ చిత్రచిత్రంగా మాట్లాడి అసలు సంగతి కప్పేసింది కాని నిజం చెప్పలేదు"

నవ్వుకున్నా

మానవత్వం అంతేగామోలు! సావిత్రి స్థితిగతులు బాగా తెలుసు మాకు అటువంటప్పుడు ఈ విషయాన్ని దాచటంలో అర్థంలేదు అందులో ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలనే కాంక్ష ఇమిడి వుండాలి అది అనిర్వచనీయంగా సాగిపోతోంది ఇంటో ఆర్థికపరిస్థితులు దిగజారుతున్నా పెదవులమీద చిరునవ్వు కనబరుస్తూ తిరగటం ఆత్మాభిమానం కాపాడుకోటానికే ననుకుంటాను

మర్నాడు ఇద్దరం పదిగంటలకు భోజనానికి వెళ్ళాం

సావిత్రి తలంటి పోసుకుని కడిగిన ఆణిముత్యంలావుంది

"నువ్విచ్చిన సిల్కు జాకెట్టు పరికిణీ ఎంతో బాగున్నాయని మా అమ్మమ్మ మురిసిపోతుంది"

"మరి నేను ప్రెజెంటుచేసినవి బాగాలేవూ?" అంది శారద వుడుకుమోత్తనం నటిస్తూ సావిత్రి నవ్వి వూరుకుంది

గాజులు కలుక్కుమన్నాయి రెండు చేతులకి బోలెడు గాజులున్నాయి ఎప్పుడు వేయించుకుందో ఏమోమరి

పన్నెండు గంటలకు కామయ్య—అదే సావిత్రి మావయ్య, రైలు దిగాడు

"దీని పుట్టిన రోజు ఇవేళనని నాకు తెలుసునండి గాని ఏంచెయ్యను సమయానికి అందుకోలేకపోయాను"

రెండు గంటల కతనువచ్చి నన్ను నిద్రలేపాడు అరడజను బత్తాయిపండ్లు టేబిలుమీద వుంచాడు

"నిద్రలేపాను ఏమనుకోకండి నేను ఈరాత్రి బండికే వెళ్ళాలి మీతో కొంచెం మాట్లాడవలసి వుండి నిద్రాభంగం చేశాను"

"ఫరవాలేదండి" అంటూ ముహం కడుక్కుని వచ్చి కూర్చున్నాను

"నేనో పొరపాటు చేశానండి దానికి క్షమాపణ మీ దగ్గర కాకపోతే మరెవరి దగ్గర చెప్పుకోను? మీరు సావిత్రిమీద చూపిస్తున్న ఆదరానికి నా చర్మంతో చెప్పులు కుట్టిచ్చినా రుణంతీరదు"

"మీరింతగా పొగడ్డానికి నేను చేసిందేమీ లేదు కాని అసలు విషయం చెప్పండి"

"సావిత్రికని వాళ్ళనాన్న వుంచిన ఎకరం అమ్మేవలసి వచ్చింది వ్యాపారంలో చాలా నష్టం వచ్చింది కోలుకోటానికి శక్తిలేదు నా వ్యాపారం పెద్దదికాదనుకోండి నేను చేసిన పని చాలాతప్పు అందుకే మీతోచెప్తున్నా "అతని కంఠం గద్గదమవటంతో అతని మానసికాందోళన నాకుబోధపడింది

"అయితే ఏవంటారు? ఇది మీ కుటుంబ విషయం ఇందులో నా కెలాంటి సంబంధంవున్నదీ? ఈ విషయం మీరు నాతో చెప్పటంలో వుద్దేశం నా కర్థంకావటంలేదు"

"ఏవీలేదు మీరింతగా ఆదరిస్తున్నారు కనక చెప్పాను దాని పెళ్ళి ఇకముందు దాని చదువు సంగతి గురించి ఏంచేయాలో నా కర్థంకావటం లేదు మరి సెలవు" అంటూ కామయ్య నమస్కరించి వెళ్ళిపోయాడు

తరవాత పావుగంటకి సావిత్రి అమ్మమ్మగట్టిగా ఏవో కేకలు వేయటం అందుకు ప్రతిగా అతనేదో

అరవటం జరిగింది. సావిత్రి సన్నగా ఏడవటం కూడా వినిపించింది. ధైర్యంచేసి అక్కడకు వెళ్ళలేక ఆ గొడవంతా చాటుగా వింటూ వూరుకున్నా. మరో అరగంటకు కావయ్య విసవిస నడిచి వెళ్ళిపోవటం చూశాను.

ఆ సాయంత్రం సావిత్రి ఇంగ్లీషు పద్యం చెప్పమని రాగానే 'ఏవిటి గొడవ?' అనడిగాను.

సావిత్రి నవ్వుతూ 'అదా!...వడ్లగింజలో బియ్యపు గింజ. ఏముంది? నా చదువు మానిపించేస్తానని మావయ్య అన్నాడు. దాంతో అమ్మమ్మ ఖయ్యిమంది.' అంది. దీంతో సావిత్రి హృదయపు లోతుమీద ఆమె కారెక్టర్ మీద పెద్ద వెలుగు పడింది.

"ఇవేళ మధ్యాహ్నం నువ్వు స్కూలుకు వెళ్ళలేదా?"

"అమ్మమ్మకు మధ్యాహ్నం జ్వరం వచ్చింది. అందుకని వుండిపోయాను. వంట అదీ నేనే చేసుకోవాలి. పాపం దానికి మధ్య మధ్య జ్వరం వస్తోంది. ఏ డాక్టరుకైనా చూపిద్దామంటే వద్దంటోంది." సావిత్రి మాటల్ని నమ్మనా? మాననా? అని ఆలోచిస్తున్నాను. ఆ మర్నాడు కాని జ్వరం మాట నిజమేనని నమ్మలేక పోయాను. డాక్టర్ని తీసుకొచ్చాం. అతను ఏమీ చెప్పలేక పోయాడు.

"ముసిలితనం నరాల బలహీనత సరైన ఆహారం లేదు." అన్నాడు ప్రశ్నార్థకంగా చూస్తున్న కళ్ళకు సమాధానంగా. కాని...

అనుకోకుండా సావిత్రి నెత్తిమీద పిడుగు పడింది. వికసిస్తున్న ఆశల్ని—అనురాగ బంధాల్ని తెంపేసి విధి వికటంగా నవ్వింది. సావిత్రి అమ్మమ్మ నాలుగు రోజులు గడిచాక పోయింది. అంతటితో ఆగినా బాగుండేది. కావయ్యకు కబురు చేస్తే అతను రాలేదు. అతనికోసం చాలా సేపు ఎదురుచూసి దహనసంస్కారం చేయవలసి వచ్చింది. ఇంతటి వడదెబ్బ తగిలినా సావిత్రి ఏడవలేదు. ఆరాత్రి మాయింటికివచ్చి పడుకుంది. రాత్రి తొమ్మిది గంటలకు తిరిగివస్తూ ఆయింటికేసి చూశాను. పాడుపడ్డ గుడిలా—ఖేదాన్ని ఒలికిస్తున్న విషాద గీతంలావుంది. ఎముకల గూడులావుండి—అటునుంచి ఇటు కదలలేని ఆ ముసిలి తొక్క ఆయింటికి కళ నెలా కలిగించిందీ—ఆమె నిష్క్రమణ ఆయింటిని జీమూతంలాంటి చీకటి ఆవరించటానికి ఎలా కారణమైందీ మాత్రం నాకు అర్థం కాలేదు. మనోవికాసంలేని సావిత్రి, జీవిత సోపానంలో ఇంకా అడుగుపెట్టని సావిత్రి జీవితానికి ఆకాశమంతప్రశ్న ఇప్పుడు దీనికి సమాధానం ఏవిటి?

రాత్రి పన్నెండు...

హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. నెమ్మదిగా వెళ్ళిచూశాను; సావిత్రి తలగడ మొహాని కడ్డం పెట్టుకుని ఏడుస్తోంది. గదిలో దీపంలేదు. చుక్కల కాంతి మాత్రం సగం తెరచిన కిటికీలోంచి సన్నగా లోపలకు జారుతోంది.

"అమ్మమ్మా!...ఇంకేం చెయ్యను నేను?... మావయ్యా" శోకంలో మాటలు పెగిలిరాక గిజగిజ తన్నుకుంటున్నాయి. తెగిన వీణమీది గీతంలా అతకని ఆవేదన సావిత్రిని ఓదారుద్దామనుకున్నాను.

కాని ధైర్యం లేకపోయింది. అదీకాక కరడుగట్టుకుపోయిన బాధలూ—ఆవేశాలూ ఏడుస్తేనే కాని తగ్గవు. ఏడవటం వలన జీవిత శృంఖలాలు తెగకపోయినా ఉపశాంతి లభిస్తుంది. మళ్ళీ వచ్చి పడుకున్నాను. ఒంటి గంటదాకా సావిత్రి ఏడుస్తూనేవుంది. క్రమంగా ఆమె ఆర్తనాదం శూన్యంలోకి అంతరిస్తున్న గీతంవలె మాయమైంది. నాలుగు గంటలదాకా సావిత్రి భవితవ్యం గురించి ఆలోచిస్తూనే వున్నాను.

మర్నాడు వుదయమే బయలుదేరి సావిత్రి చెప్పిన గుర్తులనుపట్టి కావయ్య ఇల్లు వెతుక్కుంటూ కనుక్కున్నా. అవూరు యాభై మైళ్ళదూరంలో వుంది. కొంతదూరం పడవలో వెళ్ళాలి. తీరాజేసి కొండనుత్రవ్వి ఎలకనుపట్టినట్టు కావయ్య ఇల్లు కనుక్కున్న తరవాత ఇల్లమ్మేసి అతనెక్కడికో వెళ్ళిపోయాడని తేలింది. ఎక్కడికి వెళ్ళింది ఎవరికీ తెలియదు. కావయ్య సావిత్రి విషయంలో ఇదివరకు చేసిన సంభాషణంతా గుర్తుకు వచ్చింది. మునసబు, కరణాన్నికూడా అడిగాను. ఎవరికీ తెలియదన్నారు. చేసేదిలేక తిరిగి వచ్చాను.

సావిత్రి భావిజీవితానికి మార్గమేవిటనే ప్రశ్న రాయిలా నిలబడింది. అనాధ శరణాలయంలో చేరిస్తే బాగుండు ననిపించింది. కాని మనసు వొప్పలేదు. శారదకూడా నా అభిప్రాయానికి

అనుకూలంగానే వోటుచేసింది అడిగిచూద్దామని సావిత్రి నడిగాను

"ఇకముందు ఏమిటి చేయదల్చున్నావ్?"

"ఇంక చేసేదేమిటి? చదువుకోటానికి ఆధారం లేదు అన్ని కష్టాలూ ఒక్కసారే వచ్చాయి అడుక్కుతింటాను' అంది నవ్వుతూ సావిత్రి మాటలు విన్నతరువాత ఆమెకు జీవితంమీద ఆశాజనకమైన దృక్పథంలేదని రుజువైంది ఇంత కాలంగా సావిత్రి పెదవుల మీదున్న చిరునవ్వును ఈ ఒక్కసంఘటన మొగ్గను తుంచివేసినట్టు తుంచి వేసింది చూపుల్తో చక్కిలి గింతలుపెట్టే సావిత్రి కళ్ళల్లో అమావాస్యనాటి చీకటి అలుముకుంది

"తప్పు సావిత్రీ! నువ్వంటే ఎందుకో మాకు ఆప్యాయత కుదిరింది మాలో కలిసి వుంటున్నావు నీ చదువు కొనసాగవలసిందే! మాయింటికొచ్చేయ్ అందరం కలిసి వుందాం ఏంపోయింది?" అని శారద నా అభిప్రాయమేమిటన్నట్టు నా కళ్ళల్లో చూసింది ఆమాటలు నేనే అందామనుకున్నాను కాని శారద ఆడవాళ్ళకుండే సహజగోరణిలో 'అడ్డమైన వాళ్ళను మేపటానికి ఇది ధర్మసత్రమనుకున్నారా!' అని గర్జిస్తుందేమోనని వూరుకున్నా

"శారద చెప్పింది సరైంది సావిత్రీ! ఇంక నీ కెవరూ లేరా? పోనీ వుత్తరం రాద్దాం" అన్నాను

"ఎవరూలేరు బాబాయ్!" అంది

ఆ సాయంత్రం ఆమెను తీసుకుని వాళ్ళ హెడ్మాష్టరు దగ్గర కెళ్ళాను ఆమె పరిస్థితంతా వివరించి ఎలాగైనా స్కాలర్ షిప్ గ్రాంట్ చెయ్యమనడిగాను ఏదో పోటీ పరీక్ష జరుగుతుందని అందులో బాగా మార్కులువొస్తే తప్పకుండా ఇస్తానని అన్నాడాయన ఆ మర్నాడు సామానంతా మా యింట్లోకి సర్దించాం ఇత్తడి గిన్నెల కంటె అల్యూమినియం గిన్నెలు ఎక్కువున్నాయి ఒక్కటే మంచం-ఇక్ష్వాకులనాటిది పాతాళానికి వేళ్ళు పెంచుకున్నది సావిత్రి మాలో కలిసిపోయింది కొన్నాళ్ళు సరిగ్గా అన్నంతినటం మానేస్తే ఆమెను బలవంతపెట్టవలసి వచ్చేది అమ్మమ్మను-గత జీవితాన్ని తల్చుకుని ఏడుస్తోందేమోనని ఒకొక్కనాడు రాత్రి మేలుకుని గమనించేవాణ్ణి

కాని పుండుమీద కారం జల్లినట్టు సరిగ్గా పరీక్షనాడే సావిత్రికి విపరీతంగా కడుపూ జ్వరం వచ్చింది నాకు చాలా భయంవేసింది వాళ్ళ అమ్మమ్మకు జీవన్నాటక విముక్తి కలిగించిన జ్వరం తాలూకు ఛాయలేవైనా ఆమెలో వ్యాపించబోతున్నాయేమోనని భయం-పది గంటలకు కొద్దిగా తగ్గింది రిక్షామీద తీసికెళ్ళి హాల్లో కూచోబెట్టాను, హెడ్మాష్టరును పిలిచి పరిస్థితుల్ని వ్యక్తంచేశాను ఆయన 'ఫరవాలేదు ఏదో రాయనివ్వండి' అన్నాడు కాని సావిత్రి ఎంతోసేపు పేపరు రాయలేకపోయింది బల్లమీద తల ఆన్చి పడుకుంది ఇంటికి తీసుకొచ్చేశాను మొత్తం పరీక్షకు వచ్చినవారు పదిహేనుగురు కమిటీ ఇచ్చే స్కాలరుషిప్పులు ఆరు ఆవేళటి ఇంగ్లీషు పరీక్షలో సావిత్రికి ఆరో రాంకు వచ్చిందని వినగానే నేను ఆశ్చర్యపోయాను తరువాత రెండు రోజులు పరీక్షలు బాగానే రాసింది మొత్తానికి సావిత్రికి స్కాలర్‌షిప్పు వచ్చింది వేన్నీళ్ళకు చన్నీళ్ళలా ఇదీ ఒకందుకు మంచిదేగా హాఫ్-ఇయర్లీ పరీక్షల్లో ఒక్క సైన్సులో తప్పించి తతిమా అన్నింటిలో సావిత్రిదే ఫస్టుమార్కు

ఎలాగ గడిచిందో, కాలం చకచకామని పరుగెత్తింది విసుగు విరామం లేకుండా వస్తున్న వుదయాస్తమానాల్ని గమనిస్తే ఆశ్చర్యమేసింది సావిత్రి స్కూలుఫైనలు కొచ్చింది ఇప్పుడు సావిత్రికి వన్నెచిన్నెలు సమకూడాయి ఇన్నాళ్లూ సంకోచిస్తూ సంకోచిస్తూవున్న యౌవనం యిప్పుడు పూర్తిగా వికసించి ఆకర్షణపత్రాన్ని వ్యాపింపజేస్తోంది సావిత్రివద్దని మొరపెడుతున్నా ఎన్నో రకాల చీరలు కొనిచ్చింది శారద జాకెట్లు బోలెడు కుట్టించింది ఆత్మీయత రక్త సంబంధంవలన రాదని హృదయ సాన్నిహిత్యంవలనే వస్తుందని గుణపాఠం నేర్చుకున్నా

సావిత్రికి పబ్లికు పరీక్షలు ఇంకా నెల రోజులున్నాయనగా ఓనాడు మిట్టమధ్యాహ్నం కావయ్య దిగాడు అతని ఆకారంలో కొంచెం మార్పువచ్చింది

"సావిత్రిని దిక్కూమొక్కూ లేకుండా వదిలేసి పోయినందుకు క్షమించండి మీరు క్షమించరని నాకు తెలుసు అయినా అడుగుతున్నా, ఏం చేయను? ముందు పరిస్థితులు మీతో చూచాయగా మనవిచేశాను కాని ఇంతలో ఇలా వెళ్ళి

పోవలసి వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు ఇంకెందుకులెండి అంతా అయిపోయిందిగా మిమ్మల్నింక బాధపెట్టటం న్యాయంకాదు మా సావిత్రిని తీసికెడతాను ఇప్పటికి వెయ్యి జన్మలెత్తినా మీ ఋణం తీర్చుకోలేను

నా కళ్ళల్లో అనుమానాన్ని, నేను సావిత్రిని పంపటానికి సంకోచపడుతున్నానన్న భావనని గ్రహించిన కావయ్య పకాలున నవ్వాడు

"ఇప్పుడు నాస్థితి బాగుపడింది దాన్ని గురించేగా మీరు ఆలోచిస్తున్నారు? సావిత్రికి మళ్ళీ ఎకరం కొనేశాను ఆ విషయంలో మీకేమీ అనుమాన మొద్దు ఇల్లు కూడా తిరిగి కొనేశాను ఇంకా సావిత్రి పెళ్ళి వైభవంగా జరిపిస్తాను"

కావయ్య తనమీద అదృష్టదేవత చల్లటి చూపులు ఎలా ప్రసరింపజేసిందీ వివరించిచెప్పాడు ఆ మరునాడుదయం తనితో వెళ్ళి అతని మాటల్లో వీసమంతయినా అబద్ధం లేదని రుజువు చేసుకుని తిరిగివచ్చాను కావయ్యను అభినందించకుండా వుండలేకపోయాను

మార్చి పరీక్షలు పూర్తికాగానే సావిత్రి వెళ్ళిపోయింది శారదా నేనూ కన్నీళ్ళు ఆపుకోలేక బాధపడ్డాం ఎందుకీ అనుబంధం? ఎవరూ ఎవరికీ ఏమీకాదు అదీకాక సావిత్రికీ మాకూ ఏవిధమైన చుట్టరికమూ లేదు ఒకనాడందరూ బూడిదలో కలిసిపోవలసిందే అంతిమక్షణంలో అంధకారం కబళించినప్పుడు ఎవరికెవరూ తోడురారు ఈ అసూయలూ, అనురాగాలూ, అహంకారాలూ దేనికి? ఆలోచిస్తూ వేదాంతం వేలెట్టి చూపిస్తున్న దోవకేసి చూశాను కొంతదూరం పోయాక ఆ తోవకూడా ఇరుకై ఎక్కడికి వెళ్ళేదీ తెలియకుండా బండి కదిలిపోయింది సావిత్రి భోరుమంది

ఆ తరవాత సావిత్రి అప్పుడప్పుడు వుత్తరాలు రాస్తూండేది ఒకటిరెండుసార్లు వాళ్ళవూరు వెళ్ళి ఆమెని చూసొచ్చాను జూన్ నెలలో నాకు ఆ ఊరునుండి బదిలీ కావటాన సావిత్రికీ నాకూ మధ్య దూరం నాలుగు వందల మైళ్ళకు పెరిగింది

* * *

ఆతరవాత నేను సావిత్రిని చూడలేదు పెళ్ళికి శుభలేఖ వచ్చింది సావిత్రి ఎలావుంటుందని ఆలోచిస్తున్నా ఆమెకా వాతావరణం సరిగ్గావుంటే సౌందర్యపు వెలుగులు విరజిమ్ముతూ వుంటుంది నిరాశ ఆవరిస్తే చిక్కి చీపురుపుల్లై పోతుంది బయట వర్షంరావటానికి ఇంకా మేఘాలు వురుముతూవున్నాయి శారద సామానంతా సర్దింది

అర్థరాత్రి శారద లేపేసరికి దిగ్గున లేచి కూర్చుని కళ్ళు నులుముకున్నా దొడ్లో ఆవు అంబా అని అరుస్తోంది 'తాడు తెంచేసుకుని వచ్చినట్టుంది" అంది 'అంబా' అన్న పిలుపు ఇంకా చెవులకి దగ్గరగా వినిపించింది గబగబ టార్చిలైటు వేసుకుని వెళ్ళాను వర్షం కుంభపోతగా కురుస్తోంది ఆకాశం భయంకరంగా గర్జిస్తూ మెరుస్తోంది ఆవు తాడు తెంచుకున్న మాట నిజం దాన్ని పట్టుకోటానికి పావుగంటపట్టింది దొడ్డి గుమ్మందగ్గర నిలబడ్డ శారద గొడుగు తెస్తానంది గొడుగుతో కూడా ఎక్కడతంటాలుపడగలనని వూరుకున్నా కొట్టంలో కట్టేసివచ్చి తలతుడుచుకుని బట్టలుమార్చుకుని పడుకున్నా ఇంకా హోరుమని వర్షంకురుస్తూనేవుంది

మర్నాడు నిద్రలేచేసరికి తల బరువుగా వుంది లేచినిలబడేసరికి కొంచెం కళ్ళుతిరిగాయి కొద్దిగా తలకాయ నొప్పికూడా వచ్చింది జ్వరం తగిలినట్టు నుదుటిమీద చెయ్యివేసుకుని చూసుకోగానే తెలిసింది శారదను థర్మామీటరు తెమ్మని చూసుకున్నాను వందడిగ్రీలుంది నాకు నిజంగా భయం వేసింది కొంపతీసి ప్రయాణం ఆపేవలసి వస్తుందేమో! అదే తగ్గిపోతుందని నన్ను నేనే వూరడించుకున్నాను కానది తొమ్మిది గంటలకు వుపద్రవంగా పరిణమించి పడుకోబెట్టింది కడుపుతో బాటు నూటనాలుగు డిగ్రీల జ్వరం ఆవేళ్టి ప్రయాణం ఆగిపోయింది డాక్టరువచ్చి చూశాడు

"నిన్నరాత్రి వర్షంలో బాగా తడిశారుగా! అదే తగ్గిపోతుంది మీరు మాట్లాడకుండా పడుకోండి" అన్నాడు

"ఎందుకలా యిదవుతారు? సావిత్రి పెళ్ళికింకా నాలుగురోజులుందిగా! పెళ్ళినాటికందుకోలేకపోంలెండి అయినా నిన్నరాత్రి ఆ వానలో తడవొద్దంటే నామాట విన్నారు గనకనా? మీ చిత్తం- మీ రాజ్యం- నా మాట చెవికెక్కదు. గ్రహచారం" ఆడవాళ్ళకిదో అలవాటు వాళ్ళేదో మనల్నిసుడిగుండంనుండి రక్షించబోయినట్టు-మనమా సాయాన్ని తిరస్కరించినట్టు- శారద సోది వినలేక

అటుతిరిగి పడుకున్నా గడియారపుముల్లు బరువుగా కదులుతోంది

"వచ్చావా బాబాయ్! కాని ఏంలాభం? నేను అయిదురోజులు ముందుగా రమ్మంటే నువ్విప్పుడు వచ్చావు ఏవిటి లాభం? నా శ్రేయస్సు కోరిన వాడివి ఇలాగేనా చేయటం?"

"నేను వద్దామనే అనుకున్నా కాని లాభం లేకపోయింది హఠాత్తుగా జ్వరం వచ్చి పడి పోయాను."

"ఏవైతేనేం బాబాయ్! అంతా నా గ్రహ చారం! అనుకోకుండా జరిగిపోయింది అంధకారం నన్ను కబళించేసింది నేనేం చెయ్యను? నాలుగు రోజులు ముందు నువ్వు వచ్చుంటే నాకు మన శ్శాంతిని కలిగించేవాడివి"

వెక్కి వెక్కి ఏడ్పు

"ఏవిటిది సావిత్రీ! ఎందు కేడుస్తున్నావు? నీకు ఏమైనా మతిపోయిందా? ఈ శుభసమయంలో వృథాగా ఏడుస్తున్నావు!"

"శుభసమయం నాకుకాదు నీకు తెలియదు నేను అగ్నిగుండంలో పడిపోతున్నా అమ్మో! అగ్నిగుండం దావాగ్ని"

అవును, ఆకాశాన్ని ముద్దుపెట్టుకుంటున్న మంటలు, చుట్టూ పొగలు

"అమ్మో! సావిత్రీ! సావిత్రీ!"

"ఏవిటండీ ఇదంతా" ఆనరించింది శారద కళ్లు నులుముకుంటూ గోడమీదున్న గడియారం కేసి చూశాను భ్రమలాంటి జీవితయాత్రలో ఇదో భ్రమ దీన్ని గురించి లోతుగా ఆలోచిస్తే సావిత్రి ఆత్మ నాదగ్గరకొచ్చి ఏదోచెప్తోందని భ్రమపడాలి

"పగటికల మీకు మతిపోయినట్టుంది ఎవ రైనా వింటే నవ్విపోతారు, ఆ అమ్మాయికీ మనకూ ఏవిటి సంబంధం? ఇలాంటివాళ్ళు వేలకొలది వుంటారు వీళ్ళందర్నీ చూసి ఏడవటమే నామనపని?"

ఈ మాటలు శారద అంతరాంతరాల్లోంచి రాలేదని నాకు తెలుసు మర్నాడు సాయం త్రానికి కాని జ్వరం తగ్గలేదు పెళ్ళిముహూర్తాని కైనా అందుకుంటానో లేదో నన్న అనుమానం కలిగింది మొత్తానికెలాగయితేనే, రేపు పెళ్ళనగా సాయంత్రానికి అక్కడికి చేరుకున్నాం

(ముగింపు వచ్చే సంచికలో)

కథానిక

# నిద్రలో భద్రయ్య

"రాంగేయ"

"సావిత్రి" నాటకం మహాజోరుగా సాగిపో తూంది నాటకం చూస్తున్నంతసేపూ భద్రయ్య తన్మయత్వంలో మునిగిపోయ్యాడు ఆహాహా! ఏం నాటకం! యేం నాటకం! నిజంగా యముడివేషంలో రంగమార్తాండుడి నటన అద్భు తంగా వుంది భయంగొలిపే ఆ ఆకారం, చెవుల్ని బ్రద్దలుచేసికొని గుండెల్లో దూరి, గుభేలుమనిపించే ఆ గంభీర కంఠధ్వని ఆహా అచ్చంగా యముడి లాగే వున్నాడు రంగమార్తాండుడు (అసలు యముణ్ణి వీడు చూసినట్లే!) యముడే రంగమార్తాం డుడు! రంగమార్తాండుడే యముడు!

నాటకం వదిలాక బసచేరుకున్నా, ఆలోచనలు మాత్రం భద్రయ్యని వదల్లేదు నిజంగా "సావిత్రి" గొప్ప నాటకం అందులోనూ యముడి పాత్ర ఆ నాటకానికి జీవం తనకీ చిన్నప్పటినుంచీ నాట కాలంటే మహా సరదా ఏకాటికైనా తనూ ఓ నాటకం ఆడి పేరుసంపాదించాలని తహతహ

ఆరు నూరుగాని, నూ రారుగానీ, యీసారి నాటకం ఆడితీరవలసిందే అని నిశ్చయించుకున్నాడు భద్రయ్య అందులోనూ "సావిత్రి" నాటకమే ఆడాలి తను యముడి పాత్రకి ఫిట్ తనకేం? తను రంగమార్తాండుడికి యే విధంగానూ తీసిపోడు ఆమాటకొస్తే నిమ్మకాయలు నిలబెట్టగల తన మీసాలే చాలు కట్టుమీసాలు అక్కరేలేదు

ఇక పోతే సావిత్రి వేషం గోపాలంగాడితో వేయించొచ్చు వాడూ నాటకాలంటే పడి